



**(క్రిందటి నెల నుంచి కొనసాగింపు)**

తెల్లవారింది. రవీ! భుజంగరావు తమ తమ సమాధానలతో హెడ్డాఫీసుకు చేరుకున్నారు. వారిచ్చిన సమాధానాలు యం.డి టేబుల్ ముందున్నాయి. కృష్ణమోహన్ని యం,డి ముందుకు పిలిపించారు.

"కృష్ణమోహన్ వాళ్ల సమాధానాలు ఊహించినట్టే ఉన్నాయి. చూడండి!"

కృష్ణమోహన్ అందుకున్నాడు.

ముందు రవి సమాధానం చదివి వినిపించాడు.

“ఎం.డి గారికి – నమస్తే, నిన్నమీరిచ్చిన ఆదేశం ప్రకారం నా సమాధానాన్ని సబ్మిట్ చేస్తున్నాను. ఆ సంఘటనతో నా ప్రమేయం ఏమీ లేదు. ఆ డబ్బు నా బీరువాలోనికి రావడానికి భుజంగరావే కారణమని నా అనుమానం. కాని నా దగ్గర ఋజువులు లేవు. ఇక కృష్ణమోహన్గారు అడిగిన అన్ని క్వెరీస్కి బెంగుళూరులో నేను చెప్పిన విషయాల్లోనూ ఏమార్పు లేదు. దయచేసి నా మీద మోపిన అభియోగాలు ఉపసంహరించి నన్ను తిరిగి నా పోస్టులో జాయినయ్యే టట్లుగా ఆర్డర్సు పాస్ చేయవలసినదిగా మిమ్మ ప్రార్ధిస్తున్నాను."

భుజంగారావు సమాధానం చదివాడు కృష్ణమోహన్

“సర్.. ఆ డబ్బు సంగతి గాని, మా ఎజియమ్ గారి మీద ఫిర్యాదుతో గానీ నాకే విధమైన సంబంధం లేదని విన్నవించుకుంటున్నాను."

యం,డి. కృష్ణమోహన్ వైపు తిరిగి “ ఇదీ కృష్ణమోహన్..! మనం ఊహించిన విధంగానే సమాధానాలున్నాయి. నెక్స్ట యాక్షన్?",

"అదే సార్ మీకు ఇదివరకే కేసు యొక్క అన్ని వివరాలు చెప్పాను. దాని ప్రకారం భుజంగరావే నేరస్తుడని మనం అనుకున్నదే. ఆ ఋజువులు మీకు సమర్పించాను. ఇక రవితో మనం చర్చించాలిసిందేం లేదు. భుజంగరావు కి ఋజువులు సాక్ష్యాలు చూపించి, నా ఛాంబర్లో అతని రియాక్షన్ని మీకు నివేదిస్తాను. అతర్వాత తీసుకోవలసిన యాక్షన్ని మీరే నిర్ణయించండి."

"యస్.. ప్రొసీడ్.. మిష్టర్ కృష్ణమోహన్"

కృష్ణమోహన్ ఛాంబర్కి భుజంగరావుని పిలిపించేడు. భుజంగరావు వచ్చి కూర్చున్నాడు. అతనికి కొంత దూరంలో టి.వి. స్క్రీన్, దాని ప్రక్కనే రికార్డింగ్ యంత్రం ఏర్పాటు చేశారు. ఛాంబర్లోకి ఎవరూ రాకుండా బోల్టు బిగించారు. కృష్ణమోహన్ కూడా బెంగుళూరు వచ్చిన వ్యక్తి ఆపరేషన్ ప్రారంభించాడు. కృష్ణమోహన్ భుజంగరావు వైపు తిరిగి "భుజంగరావు గారూ ! మీరు ఇప్పుడు వచ్చే సెల్ ఫోన్ సంభాషణలు వినండి' అనడం సంభాషణల రివైండింగ్ ప్రారంభమవడం ఒకేసారి.. ఆ సంభాషణ ఇలా సాగింది.

"హలో భుజంగరావుగారూ, నేను అగర్వాల్, ఇండస్ట్రియలిస్టుని. .నా ఇండస్ట్రీకి లోన్ సంగతి ఏం చేశారు?

"ఆ పని మీదే ఉన్నాను, అగర్వాల్ గారూ! మీరు కోటి రూపాయల లోన్కి అప్లై చేశారు. అది మా ఎజియం గారి చేతిలోలేదు. కాని ఆయన రికమెండ్ చేస్తే హెడ్డాఫీసు శాంక్షన్ చేస్తుంది."

"ఇంకేం ఎ.జి.ఎమ్ గారికి చెప్పి ఆ పని చేయించండి'

'లాభం లేదండీ! ఆయన రూల్స్ మాస్టర్! రూల్స్ ప్రకారం మీకు లోన్ రాదంటున్నారు".

"ఆయన ఫార్మాలిటీ ఆయనకిద్దాం. ఆ సంగతి చెప్పి నడిపించండి."

"ఆయన వినడం లేదు. ఆయన డబ్బుకు లొంగే రకం కాదు".

"అయితే ఏం చేద్దాం?

"అగర్వాల్ గారూ! మీరు నాకు 50,000/- పంపించండి! ఆ డబ్బుతో ఒక పన్నాగం పన్ని ఆయన్ని ట్రాన్స్ఫర్ చేయించడంగాని, సస్పెండ్ చేయించడం గాని చేద్దాం. వేరే కొత్త ఎజియంతో పని జరిపిద్దాం"

"ఓ.కే. భుజంగరావుగారూ, రేపే మీరు అడిగిన డబ్బు పంపిస్తాను" ఫోన్ రివైండింగ్ పూర్తయింది. ఆఫ్ చేయబడింది.

కృష్ణమోహన్ భుజంగరావు వైపు చూస్తే వాడి కంగారు చెప్పనలవి కాదు.

"భుజంగరావ్ ! మనం మాట్లాడే ప్రతిఫోన్ కాల్ రికార్డు అవుతుంది. దానిని మనం తెప్పించుకుని మరల వినవచ్చు. ఇక తర్వాత రోజు మీకు డబ్బు అందింది. దానిని మీరు మీ ఫీజు క్రింద ఇరవై అయిదు వేలు ఉంచుకుని మిగిలిన రూ.25,000/- మీ ఎజియం గారి కప్బోర్డులో పెట్టారు.

"అబద్ధం. నేనలా పెట్టలేదు!"

'పచ్చి నిజం. ఎలా పెట్టారో చూడండి"

టి.వి. ఆన్ చేశారు. ఇదీ సీన్..

భుజంగరావు ఎజియం ఛాంబర్లోకి వచ్చి లోపల బోల్టు బిగించాడు. ఎజియం ఛాంబర్లోని కప్బోర్డు తన దగ్గరున్న డూప్లికేట్ తాళంతో తెరిచి డబ్బున్న కవర్ లోపల పై అరలో పెట్టి మరల తాళం వేసి, ఛాంబర్ బోలు తీసి స్వీపర్ చేత ఛాంబర్ క్లీన్ చేయించి ఏమీ ఎరగనట్టుగా మరల ఛాంబర్కి తాళాలు వేసి తన సీటులో కూర్చున్నాడు! కట్!

కృష్ణమోహన్ భుజంగరావు వైపు చూశాడు. వాడు పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అయినా కూడగట్టుకుని "ఇదంతా నా మీద జరిగిన కుట్ర సార్" అన్నాడు.

"అవును కుట్రే! కాని నీ మీద జరిగింది కాదు, నువ్వు చేసిన కుట్ర, టి.వి.లో కన్పించేది నువ్వేనా?

"నేనేసార్, కాని కప్బోర్డు తాళాలు సార్ దగ్గరే ఉంటాయి కదా! నేనెలా తీస్తాను.?"

"అవును. తాళాలయితే ఎజియం గారి దగ్గరే ఉన్నాయి. దీనిని నువ్వు నీ తెలివితేటలతో డూప్లికేట్ తయారుచేశావు! అవునా?"

సమాధానం లేదు..!

"ఇంకా కథ పూర్తి కాలేదు భజంగం! అంతకుముందే నువ్వు ఏజియం గారి సేఫ్ లాకర్లోని డాక్యుమెంట్ల కాపీలన్నీ తీసుకున్నావు. నీ దగ్గర కెలా వచ్చాయని డబాయించకు. వాటిని రవిగారే తన ఐటి రిటర్న్ తయారు చేయడం కోసం నీకిచ్చారు. ఒక రోజున ఎజియం ఛాంబర్లో ఉన్న ఫోటోస్టాట్ మిషను పనిచేయడం లేదని ఆ డాక్యుమెంట్లన్నీ బయటకు తీసుకొని వెళ్లి రెండేసి కాపీలు తీయించి ఒకటి నీ దగ్గరుంచుకొని మిగిలిన దానితో ఐటి రిటర్ను పూర్తి చేశావు. ఈ డాక్యుమెంట్ల కాపీలన్నీ జతచేసి హెడ్డాఫీసుకు ఆకాశరామన్నపేరుతో కంప్లెయింట్ చేశావు. కప్బోర్డులోని డబ్బూ, ఈ డాక్యుమెంట్ల ఋజువులతో నువ్వూహించినట్లే రవి సస్పెండయ్యాడు. అయితే సర్కమ్ ఫరెన్షియల్ ఎవిడెన్సో మా పద్ధతి ప్రకారం ఋజువులన్నీ బయటకు తీశాం, ఏమంటావ్? భుజంగరావ్?"

భుజంగరావ్ ఏమంటాడు?

"నన్ను క్షమించండి సార్, నా బుద్ధి గడ్డి తిన్నది. మరల ఏ తప్పు చేయను. నన్ను కాపాడండి సార్"

"'ఈసంగతి నేను బెంగుళూరులోనూ, నిన్న మన యం.డి.గారూ చెప్పాము. నువ్వు ఖాతరు చెయ్యలేదు. నౌ ఇటీజ్ టూలేట్! రూల్స్ ప్రకారం యాక్షనుంటుంది. నువ్విక వెళ్ళవచ్చు."

భుజంగరావు బయటకు వచ్చి యం.డి.ని కలిసే ప్రయత్నం చేశారు. కాని ఫలించలేదు. ఏడుస్తూ తిరుగు ప్రయాణమయ్యాడు. భుజంగరావు వెళ్లిపోయాక రవిని పిలిపించారు.

"రవి గారూ ! కూర్చోండి. మిస్టరీ విడిపోయింది. చూడండి, వినండి" అంటూ టెక్నీషియన్ వైపు చూశాడు. మరలా ఫోన్ సంభాషణ, టి.వి. స్క్రీన్ వినడం, చూపడం జరిగింది. రవి అదిరిపోయాడు. లేచి కృష్ణమోహన్ రెండు చేతులూ పటుకుని తన కళ్ల కద్దుకున్నాడు. ఆశ్చర్యంతో, "ఇదంతా ఎలా సాధ్యం కృష్ణ మోహన్ గారూ?" అన్నాడు.

"బ్రాంచీలను, బ్రాంచి మేనేజర్ను కంట్రోల్ చేయడానికి మేనేజ్మెంటు కొన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఆ ఏర్పాట్ల మేనేజర్కి కూడ తెలియవు. ఇక ఫోన్ రికార్డుల సంగతి. నేటి టెక్నాలజీతో ఇదంతా సాధ్యం. మనం జరిపే ప్రతి సంభాషణ రికార్డవుతుంది. అవసరమయితే తగిన అథారిటీ ఉన్న వాళ్లు అడిగితే ఆ సంభాషణ రికార్డింగు ఇస్తారు. నౌ యు ఆర్ ఫ్రీ. మీరు హేపిగా బెంగుళూరు వెళ్లండి. రేపే మీకు మంచి కబురు అందుతుంది."

"థాంక్యు కృష్ణమోహన్ గారూ!'

" ఆ థాంక్స్ యం.డి. గారికి చెప్పి సెలవు తీసుకోండి"

రవి మరోసారి కృష్ణమోహన్కి కృతజ్ఞతలు చెప్పి యం.డిని కలిశాడు.

"రవిగారూ! మీ మీద మోపిన అభియోగాలు ఫాల్స్ అని మాకు ముందే తెలుసును. కాని వాటి ఋజువులు కావాలి కదా! ఈలోపులో మీరు మీ సీటులో ఉండకూడదు గనుక సస్పెండ్ చేశాం ! డోంట్ వర్రి. అయినా భుజంగరావు మీద కంప్లెయింట్స్ వచ్చినా మీరతని సీటు మార్చకపోవడం, యాక్షన్ తీసుకోక పోవడం, తప్పు! మనం మంచిగా ఉంటే సరిపోదు. దుర్మార్గుల బారినుండి తప్పించు కోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇకనుంచి జాగ్రత్తగ ఉండండి"

"థాంక్సు సార్ మీకు ఆ జన్మాంతం ఋణపడి ఉంటాను"

"ఇట్సాలైట్ రవీ! విష్యూ ఆల్ ది బెస్ట్"

రవి సంతృప్తితో, సంతోషంతో బయటకు నడిచాడు.

★★★

తెల్లవారే సరికి రవి, భుజంగరావు బెంగుళూరు చేరుకున్నారు.

భుజంగరావు మామూలుగా బ్యాంకు టైముకి బ్యాంకుకు వచ్చాడు. తన సీటులో కూర్చున్నాడు. మరో అరగంటలో ఎజియం ఛాంబర్కి వెళ్లి నమస్కరించి నిలబడ్డాడు.

"కూర్చోండి, భుజంగరావుగారూ!" అంటూ అతని చేతిలో హెడ్డాఫీసు నుండి వచ్చిన కమ్యూనికేషన్ని పెట్టాడు. చదవి భుజంగరావు పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. ఆ కమ్యూనికేషన్ సారాంశం :

“మిష్టర్ భుజంగరావూ ! గతంలో మీ మీద లంచగొండితనం మీద చాలా ఫిర్యాదులు వచ్చాయి. కాని మీ ఎజియం రవి గారు మంచి హృదయంతో మిమ్మల్ని క్షమించి వార్నింగ్ ఇచ్చి వదిలేశారు. దానికి మీరు కృతజ్ఞత చెప్పాలి. కాని ఉపకారికి అపకారం తలపెట్టారు. మీరు చేస్తున్న తప్పును ఆయన చేసినట్లుగా ప్రణాళికాబద్ధంగా ఋజువు చేసే ప్రయత్నం చేశారు. నిజాలు తెలుసుకున్నాక మీరే దోషి అని ఋజువులు సేకరించాం. అవి మీరూ స్వయంగా చూశారు. మీ ఈ నేరానికి తగిన శిక్ష మిమ్మల్ని సర్వీసు నుండి తొలగించడం, అంతేగాక మిమ్మల్ని చట్టబద్ధంగా తగిన శిక్ష కోసం పోలీసు రిపోర్టు ఇవ్వడం, కాని ఇది మీ ప్రథమ తప్పిదంగా భావించి మీకు మీ ప్రస్తుతపు కేడర్ నుండి రెండు స్టెప్పులు తగ్గిస్తున్నాం. ఈ శిక్ష మీకు ఈ రోజు నుండే అమలులోకి వస్తుంది. మీ డిగ్రేడెడ్ కేడర్లో ఈ రోజే ఎజియం గారికి రిపోర్టు చేయబడి, త్వరలో మిమ్మల్ని మఫ్సిసిల్ బ్రాంచికి ట్రాన్సఫర్ చేయడం జరుగుతుంది."

ఈ ఆర్థరు తీసుకుని భజంగరావు ఛాంబరు బయటకు వెళ్లిపోయాడు.

★★★★

శ్యామసుందర్ రవికి ఫోన్ చేశాడు, రమ్మని. రవి శ్యామ్సుందర్ని కలిశాడు.

"కమాన్ రవీ! ప్లేజ్ టేక్ యువర్ సీట్” రవి విష్ చేసి శ్యామసుందరకి ఎదురుగా కూర్చున్నాడు. అతని చేతిలో హెడ్డాఫీసు కమ్యూనికేషన్ పెట్టారు. దాని సారాంశం :

“ మీ సస్పెన్షన్ అర్థర్ని రివోక్ చేస్తున్నాం. ఈ రోజే మీ పాత సీటులోకి ఎంటరవ్వండి.”

రవి ఆ కమ్యూనికేషన్ చదవి శ్యామసుందర్కి షేక్ హేండ్తో థ్యాంక్సు చెప్పాడు,

ఈ లోపల బ్యాంక్ ఆఫీసర్స్ని ఛాంబర్కి పిలిపించారు. శ్యామ్సుందర్ తన సీటులోంచి లేచి" మీ ఆఫీసర్స్ అందరికీ తీపి కబురు, మీ ఎజియం రవిగారి మీద మోపిన అభియోగాలన్నీ విత్డ్రా చేసి సస్పెక్షన్ని రివోక్ చేస్తూ హెడ్డాఫీసు నుండి ఆర్డర్సు వచ్చాయి. " రవి వైపుకి తిరిగి “ రవిగారూ, మీ ఒరిజినల్ సీట్లోకి రండి, ప్లీజ్” అనడం, అందరూ కరతాళధ్వనులు చేయడం, రవి తన సీటులోకి ప్రవేశించడం ఒక్కసారే జరిగాయి. అదే రోజు లంచ్ టైములో ఈ క్రొత్త ఆర్డరు గురించి శ్యామ్సుందర్ స్టాఫ్కి ఎనౌన్సు చేయడం జరిగింది. తను అందరి దగ్గర సెలవుతీసుకుని ఛార్టీ తిరిగి రవికి అప్పగించి ఆరోజు సాయంకాలమే హెడ్డాఫీసుకు వెళ్లిపోయాడు.

## VI

ఈ సంఘటన జరిగిన వారం రోజులకు కృష్ణమోహన్ ఫోన్ మోగింది.

“హలో, ఎవరండీ??”

“నేను సార్, బెంగుళూరు సిటి బ్రాంచి ఎజియం రవిని"

'ఏమిటి విశేషాలు?

నేను మిమ్ము ఒకసారి కలవాలనుకుంటున్నాను"

“అఫీషియలా, పెర్సనలా?”

“పెర్సనలే. వ్యక్తిగతంగా మీ రెసిడెన్స్లో కలవడానికి మీ అనుమతి కావాలి. దయచేసి అడ్రస్సు చెప్పండి, కేవలం థ్యాంక్స్ చెప్పడానికి"

“సరే" అని చెప్పి తన రెసిడెన్సియల్ అడ్రస్సు చెప్పాడు. చెబుతూ "మీరు నన్నిలా కలుసుకుంటున్నానవి గాని, కలిసిన తరువాత కలిసినట్టుగాని ఎవరికీ చెప్పవద్దు"

“అలాగే సార్! రేపు ఆదివారం ఉదయమే మీ యింటి దగ్గర కలుసా".

అనుకున్న ప్రకారమే రవి ఆదివారం ఉదయం 9గం|కి కృష్ణమోహన్ ఇంటికి వెళ్ళాడు. కూడా బెంగుళూరులో ప్రసిద్ధి పొందిన కోవా" ని డజను యాపిల్స తీసుకుని వచ్చి కృష్ణమోహన్కిచ్చేడు. అతిథిని ఆహ్వానించి కాఫీ ఇచ్చి తనూ మరో కప్పులో సిప్ చేసూ అడిగాడు “రవిగారూ ! నన్ను కలవాలని మీ కెందుకనిపించింది!? "

ఈలోగా రవి కాఫీ సేవనం పూర్తయింది.

"కృష్ణమోహన్, మిమ్మల్ని గారూ అని పిలవాలనిపించట్లేదు. అన్యథా భావించకండి

"మీరు పెద్దవారు, మీరెలా పిలిచినా నాకూ బాగుంటుంది"

"కృష్ణమోహన్! మిమ్మల్ని చూస్తే నాకెందుకో ఒక ఆత్మీయుడిని చూసినట్టనిపించింది. ఇటువంటి మాటలు ఆఫీసులో మాట్లాడకూడదు. పైపెచ్చు మీరు నామీద మోపబడిన అభియోగాల నిజానిజాలు తెలిసికోవడానికి వచ్చినవారు. అందువలన నా మాటలను మరో రకంగా అర్థం చేసుకునే ప్రమాదముంది. కాని ఇక్కడ నా భావాలు యధేచ్ఛగా చెప్పవచ్చును. మీరొక సస్పెండయిన – అదీ ఆర్థికలావాదేవీల్లాంటి అభియోగాల మీద – ఆఫీసర్ని ఎంక్వయిరీ చేయడానికి వచ్చారు. అయినా మీ ఎంక్వయిరీ మోడస్ ఆపరండీ అంతా చాలా నిష్పక్షపాతంగా సాగబట్టే నాకు సంపూర్ణ విముక్తి అభించింది. ఒక వేళ నెగెటివ్ ఎప్రోచ్తో సాగితే విచారణ, ఫలితం మరోరకంగా ఉండేది. ఇంకా చెప్పాలంటే నేను చాలా ఈజీ గోయింగ్ మనిషిని. అటువంటి నా మీద ప్రత్యేక అభిమానంతో మీ విచారణ సాగింది. దానికి నా కృతజ్ఞతలు, అయినా ఈ ఎపిసోడ్ని కొంచెం సీరియస్గా తీసుకుని మనుషులను అర్థం చేసుకోవడానికి నా జీవితంలో మొట్టమొదటి సారిగా ప్రయత్నిస్తున్నాను. అందువలననే మీ అనుమతితో మీ యింటికి రావడంజరిగింది." రవి ఇచ్చిన "వచ్చిన అభిప్రాయానికి" ఉపోద్ఘాతం కృష్ణమోహన్కి నచ్చింది.

మనిషయినవాడు ఇటువంటి ఎప్రోచ్తో ఉండటం మంచిదని ఉండాలని తన తల్లి, మాతామహుడు తరచుగా చెబుతుంటారు. ఆ థియరీకిది ప్రాక్టికల్స్!

"రవి గారూ! మీరు సరిగానే అర్థం చేసుకున్నారు. కానినేనిప్పుడు చెప్పబోయే సంగతులు – అదీ నా పాజిటివ్ ఎప్రోచ్కి కారణాలు – మన ఆఫీసుల్లో ఎవరికీ చెప్పవద్దు. అది మన ఇద్దరికీ మంచిది కాదు"

"మీ మాట నేను తప్పక పాటిస్తాను. మీరు చెప్పే వాటి కోసం నాకిపుడు మరింత ఆసక్తి పెరుగుతున్నది. దయచేసి చెప్పండి!"

"మీ మీద ఎంక్వయిరీకి వెళుతున్నట్లు నేనొకరికి చెప్పాను. ఆమె మిమ్మల్ని ఎరుగును, పూర్తిగా, ఆమె మీ గురించి చెప్పిన మాటల సారాంశం "బాబూ, ఈ రవి 'స్వతహాగా మంచివాడు ఇతరులకెప్పుడూ హాని తలపెట్టని వాడు. ఇక డబ్బు లావాదేవీల్లో నిప్పు! ఎంత ఉన్నతమైన స్థానంలో ఉన్నా ఎన్ని అవకాశాలు వచ్చినా – లంచం అనే మాటకు అందనంత దూరంలో ఉంటాడు. పరులసొమ్ముని అతను పాములా చూస్తాడు. ఇక ఆఫీసు వ్యవహారాల్లోనూ ఎటువంటి వ్యామోహానికి లొంగడు. తనకు ఆఫీసులో వప్పగించిన డ్యూటిని సిన్సియర్గా నిర్వహించడంలో ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా – వాటిని అధిగమించి 100% సత్ఫలితాలను రాబడతాడు. అతని మీద అభియోగాలకు ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుంది. ఎవరో కిట్టని వాళ్ల పన్నాగంలో చిక్కుకుని ఉంటాడు. నీకు తెలుసు కదా లంచం తీసుకోని అఫీసర్కి అనేక మంది శత్రువులింటా బయటా పొంచి ఉంటారు. అందువలన నువ్వు రవి విషయంలో పూర్తి పాజిటివ్ ఎప్రోచ్లో వెళ్లు, అతను ఒకవేళ దోషి అయితే నీ డ్యూటీని నువ్వు నిష్పాక్షికంగా చేయవచ్చు. దానికితడూ సిద్ధపడే రకమే!"

ఇలా చెప్పి "రవిగారూ ఈ మాటలే నన్ను నా విధానంలో – అదే పోజిటివ్ ఎప్రాచ్లో – నడవడానికి తోడ్పడ్డాయి."

ఈ మాటలు వింటున్న రవి నిశ్చేష్టుడైపోయాడు. నోట మాట రావడం లేదు. కళ్లలో తడి ప్రత్యక్షంగా ద్యోతకమయింది. తన వ్యక్తిత్వం గురించి తనకన్న హెచ్చుగా తెలుసుకున్న వాళ్లు ఆడవాళ్లలో ఒకరు, మగాళ్లలో ఒకరు మాత్రమే ఉన్నారు. ఈ కృష్ణమోహన్కి చెప్పిన 'ఆమె' ఆ ఇద్దరిలో ఒకరా? అదే తెలుసుకోవాలి! తన ఆసక్తి గుండె లవిసిపోయేలా ఉంది. ఉక్కిరిబిక్కిరయిపోతున్నాడు. కొంతసేపటికిగాని తెప్పరిల్లలేదు. రవి ఫీలింగ్స్ అన్నీ కృష్ణమోహన్కి అర్థమవుతున్నాయ్. అతని పశ్చాత్తప్త హృదయం అతని ముఖ కవళికల్లో స్పష్టంగా కన్పిస్తోంది.

"ఏమిటి రవిగారూ! అల్లాగయిపోతున్నారు? నేనేమీ పొరపాటుగా మాట్లాడలేదు కదాతేయ–!?"

"నో నో ఎబ్సల్యూట్లీ..! నావ్యక్తిత్వం నా కన్న బాగా తెలిసిన మీకు చెప్పిన ఆ విశిష్ట వ్యక్తి ఎవరో చెప్పండి ప్లీజ్."

"చెబుతాను. కాని ఈ విషయాలన్నీ మీ మనసులోనే ఉంచుకోవాలి. కనీసం మీ పిల్లలకుగాని, మీ శ్రీమతికిగాని చెప్పకూడదు. అప్పడే ఈ సంఘటన మనకు సత్ఫలితాలనిస్తుంది."

"అలాగే కృష్ణమోహన్! మీరంతగా చెప్పాక నేను మాట తప్పితే నా అంత కృతఘ్నుడు మరొకడుండు"

కృష్ణమోహన్ నెమ్మదిగా చెప్పాడు "మా అమ్మ".

★★★

ఈసారి రవికి నేలమీద పడిపోయినంత పనయింది. వెంటనే సోఫాలోంచి లేచి " మీ అమ్మాగారా? ఆమె పేరు? చెప్పండి ప్లీజ్"

కృష్ణమోహన్ తాపీగా "మీకు తర్వాత తెలుస్తుంది. అంతగా ఆవేశపడకండి. ప్రస్తుత పరిస్థితుల్లో నేను ఆమె పేరు చెప్పలేను." అంటూ ఆగాడు.

రవి మాన్పడిపోయాడు. అతను కృష్ణమోహన్ని రెట్టించి అడిగే ఆస్కారం లేదు. ఒకవేళ ఆమె పేరు చెప్పినా. ఆమె తానుఅనుకున్న వ్యక్తే అయితే తను మరింత పాతాళానికి క్రుంగిపోవలిసి వస్తుంది! అతను చెప్పక పోవడం. ఒకందుకు మంచిదే! ఈ లోపులో తను కొంత మనస్సును కూడదీసుకుని ఈ సంఘటనలను ఒక గుణపాఠంగా తీసుకుని – కొన్ని కరెక్టివ్ యాక్షన్స్ తీసుకోవచ్చునేమో! చూద్దాం. అనుకున్నాడు.

"రవిగారూ! మీరడిగిందానికి నేను సమాధానం చెప్పనందుకు క్షమించండి. కాని ఈ సందర్భంలో మీరేమీ అనుకోకపోతే – కొన్ని – మీ వ్యక్తిగత విషయాలు అడుగుతాను. అడగమంటారా?"

రవి కొంత కుదుటబడ్డాడు. తాను కృష్ణమోహన్కి కేవలం థ్యాంక్సు చెప్పడానికే వచ్చాడు. అదీ, నిజాయితీగా, విపులంగా, . దీన్ని ఆఫీసు వాళ్ల ముందు చెప్పడం అంత బావుండదు గనుక ఈ పద్ధతి ఎంచుకున్నాడు. కాని ఈరకంగా కృష్ణమోహన్ని కలవడం తన కథని మరో మలుపు తిప్పబోతున్నదా? అవుననే అనుకోవాలి. ఆ మలుపు మంచి మార్గానికి మేలు కొలుపుగా మారాలి. "నేనిలా వ్యక్తిగత విషయాలడగడం మీకిష్టం లేకపోతే చెప్పండి. నేనేమీ అనుకోను."

"నో.. నో.. కృష్ణమోహన్..! మీరేమి అడిగినా ఫర్వాలేదు. మీరు నాకిప్పుడొక ఆత్మీయ బంధువు. మీతో నా వ్యక్తి గతాన్ని పంచుకోవడం, మీకన్న నాకే మేలు చేస్తుంది. తప్పక అడగండి, ఏదయినా సరే."

కృష్ణమోహన్ ప్రారంభించాడు.

"మీ తల్లిదండ్రులెక్కడుంటారు? మీ అన్నదమ్ములెంతమంది? అక్కచెల్లెళ్లు? ఇవి కేవలం కాలక్షేపానికే కాదు. ఒక ప్రయోజనం – ఉభయత్రా ఆశించి అడుగుతున్నాను."

"మా తల్లిదండ్రులు విజయవాడలో ఉంటారు. నేనుగాక నాకిద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లెలు. మా సంతానంలో నేనే పెద్ద."

"రవిగారూ! మీది పెద్ద ఫ్యామిలీయే, నేటి పరిస్థితులకి! మీ సంబంధ బాంధవ్యాలు మీ కుటుంబ సభ్యులతో – మామూలుగానే ఉన్నాయా? అంటే మీ దగ్గరకు వాళ్ళూ వాళ్ల దగ్గరకు మీరు రాకపోకలు నార్మల్గా ఉన్నాయా? కుటుంబాల్లో జరిగే సోషల్ ఫంక్షన్స్.. పుట్టినరోజులూ, పెళ్లిళ్ళూ, పెద్దల షష్ఠిపూర్తి లాంటివి ఆయా సందర్భాల్లో రాకపోకలు మామూలుగా జరుగుతున్నాయా?"

రవికి మరోసారి సాచి లెంపకాయ కొట్టినంతపనయింది. అయినా ఇదెందుకు వచ్చిందో వచ్చింది, రానియ్! వీలయినంత వరకు నిజాలే చెప్పాలని తన తాతగారు చెప్పేవారు. చిన్నతనంలో అంటే తన ఏదేనిమిదేళ్ల వయస్సులో, తన తాతగారి దగ్గర కూర్చుని ఆయన చెప్పే రామాయణ భారత కథలు శ్రద్ధగా వినేవాడు. ధర్మరాజు సత్యసంధత, అతను అబద్ధం చెప్పవల్సిన సంఘటన, రాముడికి తండ్రి మీద ఉన్న భక్తి – ఇంకా కైక తనను అరణ్యానికి పంపుతున్నా – ఆమె మీద కూడ విరోధభావం లేక పోవడం, అదే తన తమ్ముళ్లకి చెప్పివప్పించడం ఇటువంటి వన్నీ తను ఆయన దగ్గర నేర్చుకున్నన్ని పౌరాణిక నీతులు, వాటిని నేటి సంఘంలో అనుసరించాలిసిన పద్ధతులు ఇప్పటికీ గుర్తున్నాయి. ఆయన చెప్పిన పురాణపురుషుల నిజాయితీ, నిస్వార్థత – తను నేటికీ తన ఆఫీసులో అమలు చేస్తున్నాడు. అందుకే తనకు హెడ్డాఫీసులోనూ మంచి పేరున్నది. ఈ ఆలోచనల్లో పడి కృష్ణమోహన్కి సమాధానం చెప్పడం ఆలస్యమయింది.

"రవిగారూ! నేనడిగిన..."

"వస్తున్నా కృష్ణమోహన్.. వాటికి సమాధానాలు చెప్పడానికే ప్రయత్నిస్తున్నా."

"రవిగారూ! మీరు ఆఫీసులో అందరితోనూ నిష్పక్షపాతంగానూ, నిజాయితీగానూ ఉన్నారంటే మీ ఆఫీసు ఒక చిన్న సంఘం, ఇక్కడ మీ నిబద్ధత – కుటుంబమనే పెద్ద సంఘం – అంతకు మించి–మిత్రులు, పొరుగువారు, రాష్ట్రం, దేశం వరకు విశ్వమానవ శ్రేయస్సు అన్నింటా మీరలానే మంచిగా ఉంటారని, ఉన్నారని నేనాశిస్తాను. అవునా?"

రవికీ కృష్ణుడి మాటలన్నీ గొంతునుండి మాట పెగలకుండా చేస్తున్నాయి. ఆఫీసు వరకూ ఆల్రైట్.. ఎవరి నుండి కంప్లెయింటు లేదు. కాని కాని తన పెద్ద కుటుంబం (అనగా తన భార్యా బిడ్డలు.. చిన్న కుటుంబం) అంటే తన తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, వాళ్లపిల్లలూ – వీరితో పరస్పర సంబంధ బాంధవ్యాలు, వాళ్ళ కష్టసుఖాల్లో పాలు పంచుకోవడాలు, బంధుమిత్రులతో ఇచ్చిపుచ్చుకోవడాలు' – ఆప్యాయతలు, ప్రేమానురాగాలు – సోషల్ కాంటాక్స్ – ఇంకా చెప్పాలంటే, ఉభయత్రా రాకపోకలు – ఇవన్నీ ఒక పెద్దగుండు సున్నా ! కొంత వరకూ ఉన్నాయిలే అనే ఆస్కారమే లేదు! అవతలి వ్యక్తి – వయస్సులో తన కొడుకుతో సమానం – తన ఆఫీసులో కాంటాక్స్, నిజాయితీని బట్టి ఇంటా బయటా తను అలాగే ఉంటానని తనకి 100% మార్కులు వెయ్యడానికి సిద్ధంగా ఉన్నట్లున్నాడు. నిజానికి ఆ కోణంలో తనకి నూటికి ఒక మార్కు కూడా రాదు.! అదే చెప్పక తప్పదు.

ఇంతలో మరల ఆ కృష్ణమోహనుడే "రవిగారూ, ఈ విషయాలన్నీ నేనెందుకు అడుగుతున్నానని, అసలు ఇటువంటి విషయాలు లోతుగా అడగడానికి వీడెవడని మీరు అనుకుంటే ఆ మాట చెప్పెయ్యండి. నేనే మీ అనుకోను."

"నో నో కృష్ణమోహన్! మీరడగడం మీకేమోగాని నాకు మాత్రం చాల అవసరం! ఈ రూపంలో అయినా నాలోనికి నేను వెళ్లడం కనీసం ఇప్పుడయినా చాల అవసరం. ఇది నాకొక సువర్ణావకాశం, మీరు వయస్సులో చిన్నవారయినా పెద్దమనసుతో నన్నడుగుతున్నారు కాని మీ స్వప్రయోజనం కోసం కాదు గదా!"

"ఓ.కె. మీరు సరిగా అర్థం చేసుకొన్నందుకు థ్యాంక్స్"

"కృష్ణమోహన్ ! ఇప్పుడు చెప్పడానికి నాకొక దారి దొరికింది. నా పెద్దకుటుంబతోనూ, బయటి ప్రపంచంతోను నా అనుబంధాలు వాటి కనుగుణంగా రాకపోకలు పూర్తిగా జీరో! ఈ విషయంలో నేను సిగ్గుపడుతున్నాను. మీరొక ఆత్మబంధువు గనుక నా హృదయం విప్పి చెబుతున్నాను. కారణాలేమిటో కూడ నాకు తెలుసు! కాని చెప్పలేను. ఒక బలహీనతకు లోబడి ఈ విషయంలో నా బాధ్యతని కొంతయినా కాదు కదా! ఏమాత్రం నెరవేర్చడంలేదు. పూర్తిగా విస్మరించాను. ఈ పచ్చి నిజాన్ని మీకు చెప్పడానికి నేను విచారిస్తున్నాను అనడం తప్పు.. సిగ్గుపడుతున్నాను అనడం సరియైన మాట." అంటుంటే రవి గొంతుక గద్గగమయ్యింది.

కృష్ణమోహన్కి తన ప్రయత్నం కొంచెం కొంచెంగా సఫలమవుతుందన్న నమ్మకం కలిగింది.

"రవిగారూ మీరు చెప్పింది నాకర్థమయింది. మీరెందుకు మీ బాధ్యతలను విస్మరిస్తున్నారని – అదే బంధుమిత్రులతో – అని నేను మిమ్మల్ని అడిగాను. మా తాతగారు చెప్పినట్లు 'మనం మేలు కొల్పడం వరకే గాని, ఎవరి పథనిర్దేశం వారే చేసుకోవాలి అని నేను నమ్ముతాను. ఇక మరొక ప్రశ్న. మీ సహాధ్యాయులు, మీ టీచర్స్, మీ చిన్నప్పటి స్నేహితులు ఇప్పడేం చేస్తున్నారు? ఎక్కడెక్కడున్నారు? వారితో మీరు – కనీసం కొంతమంది ఆత్మీయ మిత్రులతో అయినా – కాంటాక్ట్లో ఉన్నారా? ఇదెందుకు అడుగుతున్నానంటే "మీ స్నేహితులెవరో చెప్పండి! మీ గురించి నేను చెబుతాను" అనే నానుడి ఉంది కదా. దానిని మీ మీద ప్రయోగిస్తున్నాను! మీరిచ్చిన చనువు, ఆత్మీయతా భావం వలన ఇటువంటి పనికి మాలిన ప్రశ్నలన్నీ అడుగుతున్నాను! ఏమీ అనుకోకండి"

"కృష్ణమోహన్, మీరు తెలిసికోవలసిన సమాధానానికి తగిన ప్రశ్న ఇది! ఈ విషయంలోనూ నేను ఏమాత్రం మెరుగ్గాలేను, నాచిన్ననాటి స్నేహితుల గురించిగాని, క్లాస్మేట్స్ గురించి కాని నాకిప్పుడేం తెలియదు! ఇందులో మరో విచిత్రమైన సంగతేమిటంటే నేను చదువుకున్నప్పుడు నా స్నేహితులు, క్లాస్మేట్స్లో కొందరు మా యింటికి అంటే మా తల్లితండ్రులకు పరిచయం చేసేవాడిని, తర్వాత తర్వాత తలోదారిలో అందరం వెళ్లిపోయాం. మాతల్లిదండ్రులు అప్పటి నుండి విజయవాడలోనే ఉండబట్టి నా క్లాస్మేట్స్ విజయవాడవచ్చినపుడు మా తల్లిదండ్రులను కలిసి నా గురించి ఎంక్వయిరీ చేసేవారు. మా నాన్నగారు వాళ్లకు నా కాంటాక్ట్ నెంబరిచ్చేవారు! వాళ్లు నన్ను కాంటాక్ట్ చేసేవారు. నా మంచి చెడులు, పిల్లలూ, వాళ్ల చదువులూ అడిగి వాళ్ల వ్యవహారాలు, పిల్లలు మొదలయినవి నాకు చెప్పేవారు. వాళ్ల కాంటాక్ట్ నెంబర్లు నాకిచ్చేవారు. దట్సాల్. ఇదంతా 'వన్వే ట్రాఫిక్ నేను వాళ్లను ఎపుడూ, నాకై నేను కాంటాక్ట్ చేసేవాడిని కాదు. వాళ్లకూ ఆత్మగౌరవం ఉంటుంది కదా. స్నేహం అంటే ఇచ్చిపుచ్చుకోవడం ఉండాలి కదా! దానితో మా స్నేహాలు ముగిసిపోయాయి. స్నేహితులు దూరమైపోయారు. మీరిప్పుడడుగుతున్నారు గనుక ఇదంతా చెబుతున్నాను గాని నేనెప్పడూ వాళ్ల గురించి ఆలోచించనే ఆలోచించను. ఇందాక చెప్పేను కదా గొప్ప విచిత్రం – నా ఫ్రెండ్సులో కొంతమంది మానాన్నగారితో రెగ్యులర్ కాంటాక్ట్లో ఉన్నారు. కొందరు విదేశాలు వెళ్లిపోయినా అక్కడి నుండి మా నాన్నగారిని కాంటాక్ట్ చేయడం పరస్పరం లాంగ్ కాన్వర్ సేషన్ మెయిన్టెయిన్ చేస్తున్నారు. ఆ సంభాషణలో నా గురించి

వాళ్లడుగుతూ ఉంటారు కూడ అంతేకాదు వాళ్లు ఇండియా వచ్చినప్పుడు మా అమ్మ నాన్నలను కలిసి వారితో కొంతసేపు గడిపి, భోజనం కూడ చేసి వెళ్తుంటారు. ఎప్పడయినా నేను దారి తప్పి విజయవాడలో దిగితే మానాన్నగారు ఆయా స్నేహితుల గురించి చెబుతుంటారు! ఇప్పుదు చెప్పండి, కృష్ణమోహన్! నా గురించి మీరేమనుకుంటున్నారు? చెప్పక్కర్లేదు లెండి.. మీరే కాదు, ఎవరైనా ఇదంతా వింటే ఈ రవి ఒక "అన్సోషల్ ఏనిమల్" అని తప్పక అనుకుంటారు."

ఈ మాటలు రవి అంటూ పైకి గంభీరంగానే ఉన్నా లోపల ఎంతో మధనపడుతున్నట్టు అతని గార్గదికమైన కంఠం చెప్పక చెబుతున్నది.

"అలా అనకండి రవిగారూ! నేనింత లోతుగా వెళ్లకూడదు, నిజానికి, కాని ఎందుకో నాకు తోచినవి ఒకవేళ పరస్పర ప్రయోజనాలు సిద్ధింపజేస్తాయేమో నని మిమ్మల్ని అనేక ప్రశ్నలు వేసి బాధించినట్లున్నాను. అన్యధా భావించకండి" అని సర్ది చెప్పాడు.

"లేదు కృష్ణమోహన్ నా వయస్సిప్పదు దాదాపు 58 సం||లు మీకు చెప్పిన విషయాలు ఇప్పటి వరకూ నేనెవ్వరికి చెప్పలేదు, కనీసం మా తల్లిదండ్రులకు, నాభార్యా బిడ్డలకు కూడ! అన్నీనాకే తెలుసుననే అహంభావం, లైఫ్ని ఈజీగా తీసుకోవడం మరొక బలహీనత – దానికి కారణం! ఇప్పడయినా నన్ను నేను తెలుసుకోవడానికి, దానికి తగినట్టు నా శేషజీవితాన్ని మలుపు తిప్పే ప్రయత్నానికి – మీరొక ఇన్స్టుమెంట్ అయి ఉండవచ్చు. అందువలన మీకు మరొసారి మనఃపూర్వక ధన్యవాదాలు"

ఆ యిరువురి సంభాషణ అలా భారంగా ముగిసింది. ఈలోపు లంచ్ టైమంది.

"'రవిగారూ, మన ఇద్దరం లంచికి వెళ్లాం, దయచేసి నాయా రిక్వెస్టును మీరు మన్నించాలి."

"అలాగే కృష్ణమోహన్..మరోమాట! మన ఈ దీర్ఘ సంభాషణ కేవలం మనఇద్దరి మధ్యనే ఉండాలి. ఎవరితోనూ, కనీసం మీ శ్రీమతితోను వంచుకోవద్దని నామనవి!"

"అలాగే!"

ఇద్దరూ లంచ్కి వెళ్లారు.

★★★

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments